# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

మంగళవారం | 13 | అక్టోబర్ | 2026 | పేజీలు 11 | www.manamepaper.com


## గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం



వివరాలు 2లో..

# కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు
# మౌలిక సదుపాయాలు కల్పించాలి

**బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలి**

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని కమలాపూర్‌లో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, బస్‌స్టాండ్ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్‌లోని రైతువేదికలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.**



వివరాలు 2లో..

**హుజురాబాద్, అక్టోబర్ 12 (మనం న్యూస్) :** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తెలిపారు. ఈ పథకాల ద్వారా వేలాది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.1,00,116 ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. చెక్కులతో పాటు తులం బంగారాన్ని కూడా వెంటనే అందించి పేద కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

# సామాన్య ప్రజల ఓటు హక్కును కాపాడాలి

**జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవడంలో కేంద్రం ఎందుకు వెనుకడుగు వేస్తోంది?**

**సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి**



2లో..

**సిరిసిల్ల అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) :** ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయనపై చర్యలు తీసుకునే విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో దాదాపు 300 బైకులతో భారీ బైక్ నిరసన కార్యక్రమం నిర్వహించి, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలు, ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ..."ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకునే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ..

# ప్రజావాణికి 138 దరఖాస్తులు

**పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ సమీక్ష**



**కరీంనగర్ అక్టోబర్ 12 (మనం బ్యూరో ) :** ప్రజావాణి కార్యక్రమానికి 138 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శాఖల వారీగా సమీక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 138 దరఖాస్తులు ప్రజల నుండి..

- మిగతా 2లో..

# ఖరీఫ్ కొనుగోళ్లకు ఏర్పాటు చేయాలి

**సిరిసిల్ల, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) :** ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

**సీఎంఆర్ డెలివరీపై దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



వివరాలు 2లో..

## ప్రజావాణికి 138 దరఖాస్తులు

మొదటి పేజీ తరువాయి

అందగా వాటి పరిష్కారానికి వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమానంతరం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు. ముఖ్యంగా పోలీస్, పంచాయతీ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్, ఎలక్ట్రిసిటీ, కార్పొరేషన్ శాఖల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ కొనుగోళ్లకు ఏర్పాటు చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఖరీఫ్ కొనుగోళ్లు, సీఎంఆర్ డెలివరీ పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ ఖరీఫ్ సీజన్లో ఐకేపీ 123, పీఏసీ ఎస్ 122, మెప్మా ఆధ్వర్యంలో 6 మొత్తం 251 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. అలాగే 2025- 2026 ఖరీఫ్, యాసంగి సీజన్ సీఎంఆర్ డెలివరీ పై దృష్టి సారించాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు నిత్యం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి.. డెలివరీలో వేగం పెంచాలని ఆదేశించారు. ఈమేరకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజల ఓటు హక్కును కాపాడాలి

మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు? ఆయనను ఎందుకు రక్షిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు.

ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే పరిస్థితులు రావడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండేలా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

సామాన్య ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క ప్రాథమిక బాధ్యత అని, అర్హత కలిగిన ఒక్క పౌరుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకూడదని కేకే మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా నిరసనకారులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించి, దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కును కాపాడాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను, మహాత్మా గాంధీ చూపిన ప్రజాస్వామ్య మరియు న్యాయ మార్గాలను పాలకులు గౌరవించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాలకులు ఇకనైనా తమ వైఖరిని మార్చుకోవాలని, ప్రజల మనోభావాలను గౌరవించాలని ప్రార్థించారు. "ప్రజల ఓటు విషయంలో ఇకనైనా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల వ్యవస్థలు ప్రజల పక్షాన నిలబడాలి" అని కోరారు.

కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఓటు హక్కుపై అనుమానాలు కలిగించే పరిస్థితులు ఏర్పడితే అది కేవలం ఒక పార్టీకి సంబంధించిన సమస్య కాదని, దేశంలోని ప్రతి పౌరుడికి సంబంధించిన ప్రజాస్వామ్య సమస్య అని అన్నారు. "ఈరోజు ఒకరి ఓటు హక్కు ప్రశ్నార్థకమైతే, రేపు మరొకరి హక్కు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుంది" అని తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగించేలా వ్యవహరించాలని, ఎన్నికల కమిషన్ పనితీరుపై తలెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

"ప్రజల ఓటు హక్కును కాపాడటమే మా లక్ష్యం. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై ప్రజల్లో తలెత్తుతున్న అనుమానాలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి" అని కేకే మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ భారీ బైక్ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

# కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

మొదటి పేజీ తరువాయి

**రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాలి.. కాళేశ్వరం నీటిని విడుదల చేయాలి...**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం రైతులకు కేవలం 7 గంటలే విద్యుత్ అందిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు కాళేశ్వరం ద్వారా సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

**దళిత బంధు రెండో విడత వెంటనే అమలు చేయాలి...**

దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం ఉపాధితో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండో విడత దళిత బంధును నిలిపివేయడంతో అర్హులైన దళిత కుటుంబాలు ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. దళితుల అభ్యున్నతిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రెండో విడత దళిత బంధును అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.గర్భిణులు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు తల్లీబిడ్డలకు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఆడపిల్ల పుడితే రూ. 13,000, మగపిల్లాడు పుడితే రూ. 12,000 ఆర్థిక సహాయం అందించే పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి...**

కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేసినప్పటికీ, కనీస మౌలిక సదుపాయాలు లేకుండా పంపిణీ చేసారు అని ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**బస్‌స్టాండ్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి**

కేసీఆర్ హయాంలో కమలాపూర్ బస్‌స్టాండ్ నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే అవసరమైన నిధులు మంజూరు చేసి బస్‌స్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి ప్రాధాన్యత కావాలి...**

ప్రజలకు ఉపయోగపడే పథకాలను కొనసాగించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులు, పేద కుటుంబాలు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం అందించాలని, దళిత బంధు రెండో విడత అమలు చేయాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

### కరీంనగర్ మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా రెండో రోజు నవరాత్రి ఉత్సవాలు

### లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్...

కరీంనగర్ అక్టోబర్ 12(మనం బ్యూరో )...దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో సోమవారం గాయత్రీదేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘంటతో, గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వేదమాతగా, జ్ఞానప్రదాయినిగా, సకల చైతన్యానికి మూలశక్తిగా గాయత్రీదేవిని భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం, పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సుకు ప్రతీకగా నిలుస్తుంది. దసరా నవరాత్రుల్లో గాయత్రీదేవి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించడంతోపాటు జ్ఞానానికి, ధర్మానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని గుర్తుచేస్తుంది.

**జ్ఞానమార్గంలో నడిపించే జగన్మాత**

గాయత్రీదేవి ఆరాధన ద్వారా విద్య, వివేకం, ఏకాగ్రత, సత్ప్రవర్తన కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, మంచి ఆలోచనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఈ ఆరాధనలోని ప్రధాన సందేశంగా భావిస్తారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఆలయంలో లింగార్చన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పిండితో లింగాకారం ప్రతిష్టించి అభిషేకం చేశారు. దీపాలు వెలిగించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేశ్ సహా పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సైతం దాండియా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు అధ్యాత్మిక భావనతో ఆడుతూ పాడుతూ దాండియాలో పాల్గొంటున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే గడుపుతున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిగురుమామిడి అక్టోబర్ 12 (మనం న్యూస్) : చిగురుమామిడి:బతుకమ్మ,దసరా పండుగ సందర్భంగా గ్రామంలో విద్యుత్ బల్బులు వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందడంతో ముల్కనూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన కత్తెరమల్ల రమేష్ (31) ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న ఉదయం 10గంటల సమయంలో సాంబారి భారతమ్మ, భర్త సాంబారి కొమురయ్య, భామండ్ల కళ్యాణ్, పందిపెల్లి నిఖిల్ అను వ్యక్తులు రమేష్‌ను స్ట్రీట్ లైట్ రిపేర్ చేయడానికి తీసుకువెళ్లి నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదానికి గురి చేశారని మృతుడి పెద్దనాన్న కత్తెరమల్ల వెంకటి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.గ్రామంలో విద్యుత్ బల్బులు వేసేటప్పుడు ఎవరూ విద్యుత్ అధికారుల నుండి ఎలాంటి ఎల్ సి తీసుకోకుండా, కనీస భద్రతా చర్యలు పాటించకుండా రమేష్ చేత పని చేయించారని తెలిపారు.దింతో రమేష్ ప్రమాదవశాత్తు తీవ్రమైన విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే తీవ్రంగా పడినట్లు పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ రమేష్ పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు.బాధితుడి పెద్దనాన్న కత్తెరమల్ల వెంకటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సదరు నలుగురి నిర్లక్ష్యం కారణంగా మరణానికి కారణమైనందుకు గానూ చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.

# మండలంలో కొలువుదీరిన భవాని అమ్మవార్లు



చిగురుమామిడి, అక్టోబర్ 12 (మనం న్యూస్): శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిగురుమామిడి మండల వ్యాప్తంగా భవాని అమ్మవారు ఆదివారం కొలువుదీరారు. మండలంలోని ప్రతి గ్రామంలో అమ్మవారి మండపాలు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడు తున్నాయి. మండల కేంద్రం చిగురు మామిడితో పాటు సుందరగిరి, రేకొండ, బొమ్మనపల్లి, ముల్కనూర్, నవాబుపేట, ఇందుర్తి తదితర గ్రామాల్లో యువకులు, గ్రామస్తులు ముందుండి భవాని అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

**సుందరగిరిలో ప్రత్యేక ఆకర్షణ:**

సుందరగిరి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ముందు భవాని మాత మండపాన్ని అత్యంత సుందరంగా ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారిని మొదటిరోజు బాల త్రిపుర సుందరి దేవిగా ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు పూజలు నిర్వహించారు. అర్చకులు శేషం నవీన్ కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ.. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని ప్రతిష్ఠించడం అంటే కేవలం విగ్రహాన్ని పెట్టడం కాదు, సాక్షాత్తు ఆ జగన్మాతను మన గ్రామంలోకి ఆహ్వానించడం. వేద మంత్రాలతో, పంచామృతాలతో ప్రాణ ప్రతిష్ఠ చేసిన తర్వాత ఆ విగ్రహంలో అమ్మవారు కొలువై ఉంటారు. అమ్మవారి విశిష్టత అపారం. ఈ 9 రోజులు అమ్మవారు 9 రూపాల్లో – శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రిగా భక్తులను కాపాడుతుంది. అమ్మవారికి ఎరుపు రంగు అంటే ఎంతో ఇష్టం, మందార పూలతో పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయి. భవాని దీక్ష అంటే మనసు, శరీరాన్ని అమ్మకు అంకితం చేయడం. 9 రోజులు నియమ నిష్ఠలతో, బ్రహ్మచర్యంతో, నేలపై నిద్రిస్తూ, చెప్పులు లేకుండా, మాంసాహారానికి దూరంగా ఉండి 'జై భవాని' అని స్మరిస్తేనే అమ్మ అనుగ్రహం పూర్తిగా లభిస్తుంది" అని ఆయన తెలిపారు.

**యూత్ సభ్యులు మాట్లాడుతూ..**

గ్రామ యువత అంతా ఐక్యంగా ఉండి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. 9 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు భక్తులందరికీ నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అలాగే మహిళల కోలాటం, భజనలు, అమ్మవారి చరిత్ర ప్రవచనాలు కూడా ఉంటాయి. భక్తులందరూ వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నాంఅని తెలిపారు. ఈ ఉత్సవాలతో మండలమంతా జై భవాని, జై దుర్గా భవాని'నినాదాలతో మారుమోగుతోంది

## మరవలేని మహనీయుడు అంబేద్కర్



గొల్లపల్లి అక్టోబర్ 12 (మనం న్యూస్) : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు జగిత్యాల జిల్లా ఎస్ ఆర్ ఎస్ పి ఏ.ఈ.ఈ గొడిసెల అశోక్ రాజ్.ధర్మపురి నియోజకవర్గంలోని గొల్లపెల్లి మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ" కార్యక్రమాన్ని సోమవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు గోడిశేల్ అశోక్ రాజ్,జగిత్యాల జిల్లా ఏ.ఈ.ఈ ఎస్.ఆర్.ఎస్.పి. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోడిశేల్ అశోక్ రాజ్ జగిత్యాల జిల్లా ఏ.ఈ.ఈ,ఎస్.ఆర్.ఎస్.పి, మాట్లాడుతూ అంబేద్కర్ అందరి వాడని,ఆయనను ఒక కులానికి కట్టేసి మాట్లాడటం తగదని, రాజ్యాంగ ఫలాలు అందరికీ పంచిన ఘనత ఆయనదేనని, మరువలేని మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్,సాతల్ల లక్ష్మణ్, వేల్పుల రాజేష్ లను,ఈ నామస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు .అనంతరం నామస్మరణ కమిటీ సభ్యులు గంగాధర మధుసూదన్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హనుమాండ్లు,అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు,న్యాయవాది శానికే మహేష్,విశ్వహిందూ పరిషత్తు మండల అధ్యక్షులు ఎనగందుల రమేష్,చెవులమద్ది మల్లేష్, గంగాధర ఆశయ్య,చెవుల మద్ది పోచయ్య,చెవుల మద్ది నరసయ్య,మారంపల్లి రఘు,దూల స్వామి, దాసరపు సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం

చిగురు మామిడి అక్టోబర్ 12 (మనం న్యూస్) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అనర్హులకు ఇళ్లు ఇస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. పూర్తిగా అర్హులకే ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతోందని, గ్రామసభల ద్వారా, ఇందిరమ్మ కమిటీల క్షేత్రస్థాయి పరిశీలన, అధికారుల విచారణ అనంతరమే అర్హుల జాబితా తయారు చేస్తున్నామని వివరించారు. సొంత ఇల్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. రాజకీయ కక్షతో కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. ఒకవేళ ఎక్కడైనా అనర్హులకు ఇళ్లు వచ్చినట్లు ఆధారాలతో తేలితే వెంటనే రద్దు చేస్తామని, పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే ఇస్తున్నామని, అనర్హులకు ఇస్తున్నారనే ప్రచారం అవాస్తవమని ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఖండించారు. గ్రామసభలు, క్షేత్ర పరిశీలన తర్వాతే జాబితా తయారవుతోందని, పేదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

# "ఓటు చోరీ" పేరుతో గందరగోళం సృష్టించే ప్రయత్నాలను విరమించుకోవాలి



జమ్మికుంట, అక్టోబర్ 12 (మనం న్యూస్): "ఓటు చోరీ" పేరుతో దేశవ్యాప్తంగా గందరగోళం సృష్టించే ప్రయత్నాలను కాంగ్రెస్, కాక్రొచ్ పార్టీలు విరమించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు అన్నారు. బీజేపీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో సోమవారం జమ్మికుంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు కొలకాని రాజు, ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ... దేశంలో గత అరవై ఏళ్ళుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 1952 నుంచి 2002 వరకు నాలుగైదు సార్లు ఓటరు సవరణ ప్రక్రియను చేపట్టిందని, ఓటరు సవరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ఇప్పుడే కొత్తగా చేయడం లేదని స్పష్టం చేశారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు, ఓటరు హక్కులు, ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి అత్యంత కీలకమైనవి అని అన్నారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు "ఓటు చోరీ" పేరుతో ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ ప్రజల ముందు ఆధారాలతో నిరూపించాల్సిన బాధ్యత ఉందని, ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, చట్టపరమైన మార్గాల్లో పరిష్కారం కోరాలి కానీ, కేవలం రాజకీయ ఆరోపణలతో ప్రజల్లో అనుమానాలు, అపోహలు పెంచడం సరికాదని, ఎన్నికల ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘానికి ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు కేంద్ర ఎన్నికల సంఘం కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎన్నో సార్లు ఓటరు చోరీ పై ఆధారాలు చూపించాలని నోటీసులు జారీచేసిందని, నోటీసులకు ఆధారాలు చూపించలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, కాక్రొచ్ పార్టీలు కేవలం డిల్లీలో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కైలాసకోటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, ఆడువాల శ్రీధర్, కేస స్వరూప, టంగుటూరి రాజ్ కుమార్, బచ్చు శివన్న, ఆకుల తిరుపతి, పోచయ్య, కొండ్లె నగేష్, ఉడుగుల మహేందర్, బద్రి యాదవ్, శ్రీవర్ధి ప్రవీణ్, అఖిల్, కొలకాని అరవింద్, పనికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స కోసం రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్ఓసీ



రామగిరి, అక్టోబర్ 12 (మనం న్యూస్): రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కూర నాగరాజు కుమారుడు శివాన్స్ న్యూరో కి సంబంధించిన వ్యాధితో బాధపడగాహా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో ప్రజాప్రతినిధుల ద్వారా సంప్రదించగా వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా రెండు లక్షల యాభయి వేల రూపాయల ఎల్ఓసీ మంజూరు చేయించారు.. సంబంధిత ఎల్ఓసీ పత్రాలను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సహాయకులు అందజేసినట్లు వెల్లడించారు. వైద్య చికిత్స సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కూర నాగరాజు మరియు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారం అందడం తమకు ఎంతో ధైర్యాన్నిచ్చిందని పేర్కొన్నారు.

# ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శ




చిగురుమామిడి: అక్టోబర్ 12 (మనం న్యూస్) : మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,జెపిఆర్ ఫౌండేషన్ చైర్మన్,ప్రముఖ సామాజిక సేవకులు ముప్పిడి జయప్రకాష్ రెడ్డి తండ్రి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఇంద్రారెడ్డి ఇటీవల మృతి చెందాగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ వారి కుమారులైన ముప్పిడి జయప్రకాష్ రెడ్డి,సత్యప్రకాష్ రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు.ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ఇంద్రారెడ్డి మృతికి గల కారణాలను,కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.గతంలో ముల్కనూర్ గ్రామాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకున్న సమయంలో,గ్రామాభివృద్ధి కోసం ఇంద్రారెడ్డి అన్ని రకాలుగా ఎంతో సహకరించారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాంటి ఆదర్శవంతమైన మంచి మనిషి ఈరోజు మన మధ్య లేకపోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,మెడికేర్ హాస్పిటల్ చైర్మన్ ముప్పిడి రాజశేఖర్ రెడ్డి,మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య,గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ ముప్పిడి నరసింహారెడ్డి,నాయకులు పెసరి రాజేశం,భూస ఆయిలయ్య,ముప్పిడి రాజిరెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొలకాని సమ్మయ్య




మంథని,అక్టోబర్11 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా భటుపల్లి గ్రామానికి చెందిన కొలకాని సమ్మయ్యను సోమవారం నియమించారు. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన కొలకాని సమ్మయ్యను రెండు సంవత్సరాల కాలానికి మంథని మండల అధ్యక్షులు గా నియమిస్తూ రాష్ట్ర కమిటీ నియామక పత్రాన్ని అందజేసింది.రాష్ట్ర అధ్యక్షులు మెసినేని రాజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు గాండ్ల రామచందర్,పోలం మల్లేష్ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సమ్మయ్య మాట్లాడుతూ.. నాయకపోడ్ కుటుంబ జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని,సంఘ నియమాలకు కట్టుబడి నిస్వార్థంగా పనిచేస్తానని ప్రతిజ్ఞ చేశారు.సమ్మయ్య నియామకం పట్ల మాజీ సర్పంచ్ బందెలు లక్ష్మణ్, బట్టుపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

# మంథని ప్రకండ భజరంగ్ దళ్ కమిటీ ఎన్నిక



మంథని అక్టోబర్12 (మనం న్యూస్)విశ్వ హిందూ పరిషత్ మంథని ప్రకండ, భజరంగ్ దళ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వ హిందూపరిషత్ కరినగర్ విభాగ్ కార్యదర్శి.అయోధ్య రవీందర్,పెద్దపల్లి జిల్లా భజరంగ్ దళ్ సంయోజక.సంపత్ యాదవ్.పాల్గొన్నారు. వీరి సమక్షంలో విశ్వ హింద్ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా, నూతన భజరంగ్ దళ్ కమిటీని ప్రకటించారు. మంథని ప్రకండ బజరంగ్ దళ్ సంయోజక్ గా నరేడ్ల రాజేష్,సహ సంయోజకులుగా జశీబోజుసాయి,భోగే సందీప్,గోరక్షా ప్రాముఖ్ తోగరి రాజ్ కుమార్,సురక్షా ప్రాముఖ్ఎడ్ల ఉమేశ్,బలోపాసన కేంద్ర.జెంగపల్లి అభిషేక్,అకాడ ప్రముఖవడ్లకొండ శ్రావణ్, విద్యార్థి. ప్రాముఖదేవాంశ్, సభ్యులుగాతాటి రాము,రాంబాబు, ఎరుకల.రాజేష్,తేజు, రమేష్,ఈ కార్యక్రమం లో విశ్వ హిందూ పరిషత్ మంథని ప్రకండ అధ్యక్షులు రావులసతీష్, ఉపాధ్యక్షులు బోట్ల ఆంజనేయులు, సత్సంగ్ ప్రాముఖ్. కొమురవెల్లి హరిష్, సహకార్యదర్శి,గుండా శ్రీనివాస్,ఎల్లంకి హరి,మందిర్మట్,మెడగొని రాజమౌళి గౌడ్, పరిషత్ సభ్యులు, మాలా స్వాములు, హిందూ బంధువులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ,హిందూ ధర్మ పరిరక్షణ,సేవా కార్యక్రమాలు, సమాజ ఐక్యత కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రముఖ పెద్దలు సూచించారు.

# ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం




**- ఆర్జీ-3 ఏరియాలో విజయోత్సవ ర్యాలీ..**

**కార్మికులకు స్వీట్లు పంపిణీ**

రామగిరి, అక్టోబర్ 12 (మనం న్యూస్): ఈ నెల 9న జరిగిన ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించిన సందర్భంగా సోమవారం సాయంత్రం సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి. రావు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్.సి. రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డి.టి. రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్మిక హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేయాలిఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత పాలకులు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని, యూనియన్లను తొలగించడం ద్వారా కార్మికుల హక్కులకు భంగం కలిగించారని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు సంస్థను కాపాడేందుకు నిరంతరం పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శాసనసభాపక్ష నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆర్టీసీ యూనియన్ ఎన్నికలు నిర్వహించేలా కృషి చేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో 11 రీజియన్లలో ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) విజయం సాధించడం కార్మికుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఆర్టీసీ కార్మికుల్లో కనిపించిన ఐక్యతను సింగరేణి కార్మికులు కూడా కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక హక్కులకు భంగం కలిగించే విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని, భవిష్యత్తులో జరిగే ఉద్యమాల్లో సింగరేణి కార్మికులు ముందుండి సహకరించాలని కోరారు.పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మిక నాయకులుఈ కార్యక్రమంలో ఏఎల్పీ ఫిట్ సెక్రటరీ గంగాధర్, ఓసీపీ-1 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ కె. మల్లేశ్, నక్క రమేష్, సీఎచ్పీ ఫిట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్, ఓసీపీ-2 ఫిట్ సెక్రటరీ ఎం. సురేష్తో పాటు ఎస్అండ్పీసీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే వివిధ గనులు, విభాగాలకు చెందిన అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు, షిఫ్ట్ సెక్రటరీలు, వర్క్మెన్ ఇన్స్పెక్టర్లు, సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, టెంపుల్ కమిటీ, క్యాంటీన్ కమిటీ సభ్యులు, యూనియన్ డెలిగేట్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఏఐటీయూసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం అందించాలి

**-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...**



జమ్మికుంట, అక్టోబర్ 12 (మనం న్యూస్): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం అందించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణం, జమ్మికుంట మండలం, ఇల్లందకుంట మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు సోమవారం జమ్మికుంట కెవికెలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకాల ద్వారా వేలాది పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.1,00,116 ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. చెక్కులతో పాటు తులం బంగారాన్ని వెంటనే అందించి పేద కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, దళితుల అభ్యున్నతికి సంబంధించిన పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. విద్యుత్ కోతలతో పాటు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటిని వెంటనే విడుదల చేసి పంటలను కాపాడాలని, రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం ఉపాధితో గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అయితే రెండో విడత అమలు కాకపోవడంతో అర్హులైన దళిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని అన్నారు. దళితుల అభ్యున్నతిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండో విడత దళిత బంధును వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని అన్నారు.

గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా తల్లీబిడ్డలకు అందిన ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, నిలిచిపోయిన పథకాలను ప్రభుత్వం వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. అర్హులైన తల్లులకు గతంలో ప్రకటించిన ఆర్థిక సహాయం, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను కొనసాగించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావిద్, కౌన్సెలర్స్, సర్పంచులు, అధికారులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్ట దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి, ప్రజాప్రతినిధులకు సన్మానం



రామగిరి, అక్టోబర్ 12హౌమనం న్యూస్):సమాచార హక్కు చట్ట ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో మొక్కలు నాటడంతో పాటు గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సమాచార హక్కు చట్ట సాధన కమిటీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పాంద్రాల రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.హౌఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్, ఉపసర్పంచ్ యాసం సతీష్, పంచాయతీ కార్యదర్శి పాదం స్వప్న, ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్త తులసిని శాలువాలతో సత్కరించారు.హౌసమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలిహౌసమాజంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించడం, ప్రజలకు తమ హక్కుల గురించి తెలియజేయడం, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను ప్రోత్సహించడం లక్ష్యంగా కమిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ప్రజాసేవలో భాగస్వాములవుతున్న గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, సిబ్బందిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.హౌపర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.హౌకమిటీ నాయకుల పాల్గొనడంహౌఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ తోగరి సురేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొమురోజు సురేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేగోలపు సురేష్, జిల్లా అధికార ప్రతినిధి కాశిపేట శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు యాసం శ్రావణ్, ఆర్ల సనిల్, జిల్లా కార్యదర్శి బూడిద అనిల్, జిల్లా కో-కన్వీనర్ మిట్ట సాయి పాల్గొన్నారు.హౌఅలాగే మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రామడుగు శ్రీనివాస్, ఇన్‌చార్జ్ సాయి చరణ్, ఉపాధ్యక్షుడు బూడిద రాజు, రామగుండం డివిజన్ ఉపాధ్యక్షుడు పెద్దపల్లి రామచందర్, మంథని డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎల్పుల సామ్రాట్ తదితరులు హాజరయ్యారు.

# వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



రాయికల్, అక్టోబర్ 12 (మనం న్యూస్) : రాయికల్ మండలం రామాజీపేట వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి వ్యాపారవేత్త ఉడుతల భాస్కరరావు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. వెలమ సంఘాల అభివృద్ధి, సామాజిక ఐక్యతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. సంఘం అభివృద్ధికి ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల విరాళం అందించి అండగా నిలిచిన ఆయనకు వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక వర్గ అభ్యున్నతికి, సంఘాల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు యాచమనేని వెంకట రామారావు, జకిలేటి రాజశేఖర్ రావు, యాచమనేని అజయ్ రావు, దుగ్యాల రామ్ సాగర్ రావు, దుగ్యాల వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు పాలాభిషేకం



బుగ్గారం, అక్టోబర్ 12 (మనం న్యూస్): నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటు జరిగి దశాబ్దం పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుగ్గారం మండల కేంద్రంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బుగ్గారం మండల ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వీరమల్ల సందీప్, దాసరి పూర్ణచందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించి పాలనను ప్రజలకు చేరువ చేసిందన్నారు. జిల్లాలు, మండలాల ఏర్పాటుతో విద్య, వైద్యం, సంక్షేమ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాసర్తి రాజిరెడ్డి, అబ్దుల్ రహమాన్, తుదిచెర్ల శంకర్, పొన్నం శంకర్, పొన్నం సత్తన్న, పొల్లంపెల్లి మల్లేశం, పదం సత్తన్న, గంగాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, మాసర్తి అశోక్ తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# హార్డ్ వేర్ షాప్ ప్రారంభించిన మాజీ మంత్రి



వెల్గటూర్,అక్టోబర్ 12(మనం న్యూస్): ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మల్లికార్జున ఐరన్ హార్డ్ వేర్ షాపును మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ రంగానికి ఊతం అందించేలా హార్డ్వేర్ షాపు ఏర్పాటు చేయడం అభినంద నీయమని ప్రతి ఒక్కరు స్వయంకృషితో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యజమాని ఏనగందుల గంగయ్య, తడగొండ రమేష్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐఎంఏ ఉపాధ్యక్షులు గురువారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, సర్పంచ్ గాదం బాస్కర్, మంతెన సతీష్, పడిదం వెంకటేష్, చుంచు మల్లేశం పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన జగిత్యాల ఉపాధ్యాయిని

**-20వ అవార్డు అందుకున్న మర్రిపెల్లి శ్రావణి**



కొడిమ్యాల, అక్టోబర్ 12 (మనం న్యూస్ ) : జగిత్యాల జిల్లా, కొడిమ్యాల మండలం, ఎంపీపీఎస్ అరపల్లి పాఠశాల ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్) ఉపాధ్యాయిని శ్రీమతి మర్రిపెల్లి శ్రావణి తన సేవా కార్యక్రమాలతో, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషితో వరుసగా 20వ అవార్డును అందుకుని ఔరా అనిపించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ లో నిర్వహించిన టీచర్ ఎక్స్లెన్స్ అవార్డు – 2026 కార్యక్రమంలో ఆమె "బెస్ట్ టీచర్ ఆఫ్ ది ఇయర్ ఎక్స్లెన్స్ " అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును లితెలంగాణ ఉన్నత విద్యా మండలి (టి జి సి హెచ్ ఈ ) వైస్ చైర్మన్-× ప్రొఫెసర్ ఏటిక్యాల పురుషోత్తం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి శారదా సొసైటీ చైర్మన్ డా. పట్నం కమలా మనోహర్, ట్రెజరర్ పట్నం సుజాత తదితరులు హాజరయ్యారు.20 అవార్డులు అందుకోవడం పట్ల ఆమె మాట్లాడుతూ "ఈ గుర్తింపు నాపై బాధ్యతను మరింత పెంచింది. పాఠశాల అభివృద్ధి కోసం, విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తాను. నన్ను ప్రోత్సహిస్తున్న అధికారులకు, తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు" అని తెలిపారు.

# సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్, అక్టోబర్ 12(మనం బ్యూరో )...మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బ్యాంక్ కాలనీలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద ఎస్.వి.ఎన్.ఎస్. సంస్థ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న యువతులు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్--1098 జిల్లా సమన్వయకర్త ఆవుల సంపత్ యాదవ్ మాట్లాడుతూ, యువతులు సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, దురలవాట్లకు దూరంగా ఉంటూ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను నిర్దేశించుకొని, నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి అవకాశాలు పొందాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత సమన్వయకర్త శ్రీలత, శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు మమత,జ్యోతి శిక్షకులు శ్రావ్య , అనిల్, రాములు, శ్రీనివాస్, రమేష్, మనోజ్, శిక్షణార్థినులు పాల్గొన్నారు.




# మహిళల భద్రతపై కాంగ్రెస్ మౌనం ఎందుకు?

**-జేఎన్‌యూ వ్యవహారంపై పెద్దపల్లిలో బీజేపీ మహిళా మోర్చా నిరసన**



పెద్దపల్లి అక్టోబర్ 12: మనం న్యూస్. మహిళల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని బీజేపీ మహిళా మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. జేఎన్‌యూలో మహిళా విద్యార్థులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో పెద్దపల్లిలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు వడ్డేపల్లి భారతి నేతృత్వంలో అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇన్నర్ మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి భారతి మాట్లాడుతూ, మహిళా విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్‌పై రావడం ఆందోళనకరమన్నారు. మహిళల గౌరవం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీ విచారణ, చర్యలకు సంబంధించిన నివేదికల నేపథ్యంలో సంబంధిత నాయకులు బాధ్యతాయుతంగా స్పందించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, మహిళల హక్కుల గురించి మాట్లాడే రాహుల్ గాంధీ మహిళల ఆత్మగౌరవం, భద్రత విషయంలోనూ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని భారతి కోరారు. మహిళలపై వేధింపుల ఆరోపణల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాలని అన్నారు. ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజామ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మాతంగి రేణుక మాట్లాడుతూ, మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. మహిళా విద్యార్థులపై వేధింపులకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీలన్నీ బాధ్యతాయుతంగా స్పందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులు సుల్వ పద్మ, బండారి లత, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్తూరి సరిత, జనగామ సుజాశ్రీ, జిల్లా అధికార ప్రతినిధి వసంత లక్ష్మి, దాసరి సుశీల, ఇరుగురాల శారద, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, రీసర్వే, ఎస్ఐఆర్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్




పెద్దపల్లి, అక్టోబర్ 12: మనం న్యూస్ : జీవో 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ నెలాఖరులోగా నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి రెవెన్యూ అధికారులతో జీవో 59, 76 దరఖాస్తుల పరిష్కారం, రీసర్వే ప్రక్రియ, ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జీవో 59, 76 కింద అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులు, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా ఈ నెలాఖరులోగా పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, ప్రతి దరఖాస్తుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అవసరమైన దరఖాస్తులను సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి, అర్హులైన దరఖాస్తుదారులకు నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**రీసర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి**

రీసర్వే ప్రక్రియకు సంబంధించి రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేలో భాగంగా భూముల వివరాలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో తప్పులకు తావులేకుండా, పారదర్శకంగా పనులు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు.

**ఎస్ఐఆర్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**

ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం ధ్రువీకరించాలని తెలిపారు. అర్హులైన ఓటర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా, అనర్హుల పేర్లు నమోదు కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని, అర్హులైన వారు తమ వివరాలను పరిశీలించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల నుంచి అందే దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్దేశిత విధానంలో స్వీకరించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఆర్డీవో లు గంగయ్య ,సురేష్, తహసిల్దార్లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి

**-కలెక్టర్ చిత్రా మిశ్రా.....**

కరీంనగర్ అక్టోబర్ 12(మనంబ్యూరో )...ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. గ్రామాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో తాగునీరు, విద్యుత్తు సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి గురువారం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తానని వెల్లడించారు. ఎల్‌నినో నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం రాత్రి ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, విద్యుత్తు, ఉద్యానవన, నీటిపారుదల, మత్స్యశాఖ, భూగర్భ జలాలు తదితర శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి**

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు గ్రామాల వారీగా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను చైతన్యపరచాలని, తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై రైతులు దృష్టి సారించేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యం**

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి లభ్యత, అవసరాలను అంచనా వేసి గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని నీటిపారుదల, భూగర్భ జలాల శాఖల అధికారులకు సూచించారు. జలసిరి



కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణానికి రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు వాటి సంరక్షణకు ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. మత్స్య సంపద అభివృద్ధిలో భాగంగా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

**విద్యుత్తు వినియోగంపై అవగాహన**

రాబోయే రోజుల్లో విద్యుత్తు వినియోగం, డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్తును పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ప్రతి గురువారం సమీక్ష**

ప్రతి గురువారం నిర్వహించే సమీక్ష సమావేశానికి అధికారులు పక్కా ప్రణాళికలతో, సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. గ్రామాల వారీగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికల అమలు పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపడుతూ, ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**ఐడీఓసీ ప్రజావాణికి 129 దరఖాస్తులు.**

సిరిసిల్ల, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్జిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 129 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ...ప్రజావాణి కి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 07 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 01 దరఖాస్తు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లో స్వీకరణ**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓ లు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించార. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 0, చందుర్తి



మండలం 0, ఇల్లంతకుంట మండలం 0, గంభీరావుపేట మండలం 04, కోనరావుపేట మండలం 0, ముస్తాబాద్ మండలం 02, రుద్రంగి మండలం 0, తంగళ్లపల్లి మండలం 02, వీర్నపల్లి మండలం 01, వేములవాడ అర్బన్ మండలం 03, వేములవాడ రూరల్ మండలం 02, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 01 చొప్పున వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగు తుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో ద్వితీయ స్థానం

**-ఇంజనీర్ కోల అన్నారెడ్డి కి ఘన సన్మానం**




కరీంనగర్ అక్టోబర్ 12(మనం బ్యూరో ).. కరీంనగర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి 1,961 ఓట్లు సాధించి, మొత్తం 17 మంది అభ్యర్థుల్లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాధించిన విజయాన్ని పురస్కరించుకొని, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో పాఠశాల ప్రబంధకారిణి తరపున ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, డా. ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, చింతల కిషన్, బొడ్ల శ్రీనివాస్, కొత్తూరి ముకుందశీ, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, ఆచార్యులు మరియు మాతాజీలు పాల్గొని ఇంజనీర్ కోల అన్నారెడ్డి కి అభినందనలు తెలియజేశారు. శిశుమందిర్ డెవలప్మెంట్ కమిటీ కార్యదర్శిగా పాఠశాలను అభివృద్ధి చేసి, సమాజ సేవ పట్ల ఆయనకున్న నిబద్ధత, సేవాభావం మరింతగా విస్తరించాలని, భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల ప్రధానచర్యులు మోర రణధీర్ ఆకాంక్షించారు.

# అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్ట్ జం గం విజయ్‌కి అండగా మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు

మెట్ పల్లి అక్టోబర్ 12( మనం న్యూ స్)అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్ట్ జంగం విజ య్ కి అండగా మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు.అనారోగ్యంతో బాధ పడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల వెల్నెస్ ప్రైవే ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యుడు సీనియర్ జర్నలిస్ట్ జంగం విజయ్ ను సోమవారం ఆసు ప త్రిలో కలిసి ఆయన ఆరోగ్యం గురించి ఆ సుపత్రి డాక్టర్ లతొ మాట్లాడి తెలుసు కు న్నారు.అనంతరం తమవంతుగా ఆర్థిక సహాయం 20వేలు ఆయన కుటుంబ సభ్యులకు అంద జేశారు. ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, గౌర వ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షు డు మహ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ లు పాల్గొన్నారు.



# రాజాపూర్ గ్రామ సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి



రామగిరి, అక్టోబర్ 12 (మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకుడు మాటేటి రాజబాబు నేత కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజాపూర్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాజాపూర్ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాటేటి రాజబాబు నేత పేర్కొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



రామడుగు అక్టోబర్ 12 మనం న్యూస్ )..బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రామడుగు మండలంలోని గుండి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బతకమ్మ సంబరాలను గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం తో పాటు పాలకవర్గం ఏర్పాట్లను చేశారు. ఎన్నడూ లేని విధంగా గ్రామ సచివాలయం వద్ద తిరొక్క పూలతో గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మను పేర్చి అలంకరించారు. గ్రామ సచివాలయం ముందు పెట్టి బతుకమ్మ పాటలతో, దాండియా నృత్యాలతో పిల్లలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సయ్యద్ ఫెరోజ్, వార్డు సభ్యులు సోయల్ గోదరి తిరుపతి మద్ది రాజు మేడి వజ్రమ్మ రాములు ,ముంజాల రజిత ప్రవీణ్, మద్ది శ్వేతా మురళి, పారునంది అంజలి కొమురయ్య, కార్యదర్శి జనార్దన్ అంగన్వాడీ టీచర్లు వివోలు ఆశా వర్కర్లు మహిళలు గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలకు ఉపయోగపడే చిత్రాలు తీయాలి

రామగిరి, అక్టోబర్ 12 (మనం న్యూస్):ప్రజలకు ఉపయోగపడే సందేశాలతో కూడిన చిత్రాలను రూపొందించాలని లొంకకేసారం సర్పంచ్ ఎండీ మంజూర్ అన్నారు. సోమవారం రామగిరి మండలం లొంకకేసారం శివారులోని తన ఫామ్‌హౌస్‌లో హెల్పింగ్ నేచర్ అనే లఘుచిత్రం షూటింగ్‌ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజూర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులను ప్రోత్సహించాలని, కొత్తదనంతో కూడిన లఘుచిత్రాలను రూపొందించి ప్రజలకు ఉపయోగపడే సందేశాలను అందించాలని సూచించారు. ఇలాంటి లఘుచిత్రాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ పులిపాక దేవా దర్శకత్వంలో ఈ లఘుచిత్రం రూపొందుతోంది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జబ్బర్ ఖాన్, పద్మలత, మడిపోజు మానస, మ్యాజిక్ శశి, ప్రశాంత్, మధునయ్య, అంజలి, సతీష్, సునీల్ కంక, కెమెరామెన్ కందుల వెంకటేష్, పిట్టల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



# శాతవాహన కామర్స్‌లో నోముల సందీప్‌కు పిహెచ్‌డి పట్టా



కరీంనగర్ అక్టోబర్ 12(మనం బ్యూరో )...శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థిగా ఉన్న నోముల సందీప్ పిహెచ్.డి డిగ్రీకి అర్హత సాధించినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.పరిశోధన అంశమైన "ఫైనాన్షియల్ పర్ఫామెన్స్ ఆఫ్ స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీస్ ఇన్ ఇండియా ఏ స్టడీ" (భారతదేశంలోని స్టాండ్అలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల ఆర్థిక పనితీరు – ఒక అధ్యయనం) పరిశోధన పర్యవేక్షకులు వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి. హరికాంత్ ఆధ్వర్యంలో సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని సమర్థంగా మౌఖిక పరీక్ష అయిన వైవాలో సమర్పించినందుకు శాతవాహన విశ్వవిద్యాలయం ఆయనకు వాణిజ్య శాస్త్రంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా సందీప్ తనకు పరిశోధనలో సహకరించిన హరికాంత్ కు, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ కి రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ కి అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆపదలో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడి రక్తదానం




కరీంనగర్ అక్టోబర్ 12(మనం బ్యూరో )...కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ( ఆపదలో సహాయానికి రా) వ్యవస్థాపక అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. గోపి కృష్ణ ఆపదలో 42 వ సారి రక్తదానంతో ఆదుకున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి జి. తిరుపతి తెలిపారు. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి (60) గుండెకు ఆపరేషన్ నిమిత్తం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు యూనిట్ల అరుదైన 'ఒ" నెగటివ్ రక్తం అవసరం కాగా డాక్టర్ ఆర్. గోపి కృష్ణ 42 వ సారి మరియు సంస్థ సభ్యుడు పి. విజయ్ రెడ్డి 11వసారి రక్తదానంతో ఆదుకున్నారు. ఈ సందర్భంగా రక్తదానంతో ప్రాణదాతగా నిలిచి ఎంతో మంది యువతను రక్తదానం పట్ల ప్రోత్సహిస్తున్న డాక్టర్ ఆర్. గోపి కృష్ణను, విజయ్ రెడ్డి లను సంస్థ ఉపాధ్యక్షులు కె. ప్రవీణ్ సభ్యులు జి.తిరుపతి,బి. మహేష్, ఎం. రవిచందర్, ఎస్. నిఖిల్ తదితరులు అభినందించారు.

# ఆపదలో ఆదుకున్న రేకొండ గ్రామస్థులు



చిగురుమామిడి, అక్టోబర్ 12 (మనం న్యూస్): మానవత్వం చాటుకున్న రేకొండ గ్రామస్తులు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, రేకొండ గ్రామానికి చెందిన కీ.శే. బొడ్డు కొమురయ్య ఈ నెల 4వ తేదీ ఆదివారం రోజున అకాల మరణం చెందారు. వారి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో రేకొండ వాట్సాప్ గ్రూప్ సభ్యులు చొరవ తీసుకున్నారు. గ్రామానికి చెందిన సామాజికవేత్త, కంటి డాక్టర్ తప్పొరపు శ్రీనివాస్, వార్డు సభ్యులు చెంచల నాగరాజు, అడేపు తిరుపతి, చంచల రవి, ఎలిగేటి శ్రీనివాస్, చంచల సుధాకర్, తెలంగాణ వాణి విలేఖరి జీడి నగేష్ తదితరులు దాతల నుండి విరాళాలు సేకరించారు. సేకరించిన రూ. 16,753/- లను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కష్టకాలంలో ఆదుకుని, ఆర్థిక సాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం

సుల్తానాబాద్ మనం న్యూస్ అక్టోబర్ 12 : సుల్తానాబాద్ లో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ప్రముఖ వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎర్త్ ఫౌండేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో మొ-త్తం 120 మంది చిన్నారులు, పెద్దలు, వృద్ధులు పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ అమిశెట్టి శ్రావణి మాట్లాడుతూ, ఎర్త్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మహిళలు, యువత ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, కర్రసాము వంటి వివిధ ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నైపుణ్యాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు.

**12 ఏళ్లుగా సేవలు – కో-ఫౌండర్ శ్రీనివాస్**

ఎర్త్ ఫౌండేషన్ కో-ఫౌండర్ కలవేణి శ్రీనివాస్ మాట్లాడుతూ, "పిల్లల అభివృద్ధే దేశ అభివృద్ధి" అనే లక్ష్యంతో 2012 నుంచి ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని విద్య, కళలు, ఆరోగ్య రంగాల్లో సేవలందిస్తున్నామని తెలిపారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరి ఆర్థిక స్వావలంబన అవసరమని,




అందుకే స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ప్రతి మనిషి జీవితంలో కంటి చూపు కీలకమని, ఎవరూ కంటి సమస్యలతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అమిశెట్టి తిరుపతి, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెల, సెంటర్ ఇన్‌చార్జి బుచ్చిబాబు, కోఆర్డినేటర్లు రాజు, శ్రీధర్, లత, అరుణ, సంధ్య, వాసన్ హాస్పిటల్ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి, మరింత చికిత్స అవసరమైన వారిని హాస్పిటల్ కు రిఫర్ చేశారు.

## ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి ఫోటో ఏదీ..?

### తాహసిల్దారును నిలదీసిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్...

### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడంపై వివాదం...

జమ్మికుంట, అక్టోబర్ 12 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడంపై జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత తహసిల్దార్ ను ఆమె నిలదీయడంతో కార్యక్రమం వద్ద ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నేపథ్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తప్పుబట్టినట్లు తెలిసింది. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన




కార్యక్రమాల్లో ప్రోటోకాల్, అధికారిక మార్గదర్శకాలు పాటించాల్సిన అవసరం ఉందని ఆమె అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం.

**నిబంధనల అమలుపై చర్చ...**

ప్రభుత్వ పథకాల అమలులో అధికారుల సమన్వయం, ప్రభుత్వ మార్గదర్శకాల పాటింపు కీలకమని ఈ ఘటన మ-రోసారి చర్చకు దారితీసింది. ఫ్లెక్సీ రూపకల్పన, దాని ఏర్పాటు బాధ్యత ఎవరికి అప్పగించారు..? ముఖ్యమంత్రి ఫోటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడానికి కారణాలేమిటి..? ఈ విషయంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా..? అనే ప్రశ్నలు చర్చకు వస్తున్నాయి.

ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పష్టతనివ్వడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## గ్రామ అభివృద్ధికి సహకరించండి

### -కేంద్ర మంత్రిని కలిసిన లింగాపూర్ సర్పంచ్

శంకరపట్నం అక్టోబర్ 12 (మనం న్యూస్) : శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామ సర్పంచ్ మోరే స్వరూపా రవి సోమవారం కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల వివరాలను మంత్రికి వివరించి, వాటి మంజూరుకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని కోరారు. దీనిపై బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, లింగాపూర్ గ్రామ అభివృద్ధికి అవసరమైన పనుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి సర్పంచ్ మోరే స్వరూప చేస్తున్న కృషిపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు, గౌరవేని శ్రీనివాస్, మోరె రవి, సందెల రంజీత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## గొల్లపెల్లిలో బాలీవుడ్ దిగ్గజ నటుడు నానా పటేకర్‌కు ఘన నివాళులు

### సాధారణ జీవనశైలితో సమాజ సేవలో ప్రత్యేక గుర్తింపు

### మహానటుడు నానా పటేకర్

గొల్లపెల్లి అక్టోబర్ 12 (మనం న్యూస్) : బాలీవుడ్ దిగ్గజ నటుడు, సామాజిక సేవకుడు నానా పటేకర్‌కు గొల్లపెల్లి మండల కేంద్రంలో ఘనంగా నివాళు లర్పించారు. ఫ్యాన్ ఆఫ్ గొల్లపెల్లి ఆధ్వర్యంలో గంగాధర మధుసూదన్, శాతల లక్ష్మణ్, వేల్పుల రాజేష్, ఎనగందుల రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నానా పటేకర్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నానా పటేకర్ గొప్ప నటుడిగా గుర్తింపు పొందడమే కాకుండా, నిరాడంబరమైన జీవనశైలితో అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆయన, సామాజిక సేవలోనూ ముందుండి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా మహారాష్ట్రలో రైతులకు సహాయం చేస్తూ, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచిన గొప్ప వ్యక్తి నానా పటేకర్ అని పేర్కొన్నారు. కళారంగంలో విశేష సేవలకుగాను 2013లో పద్మశ్రీ పురస్కారం అందుకున్న ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. నటనతో పాటు మానవతా విలువలకు ప్రాధాన్యమిచ్చిన నానా పటేకర్ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వారు పేర్కొన్నారు.

## అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

### -12 మందిని అదుపులోకి తీసుకున్న మంథని పోలీసులు

మంథని అక్టోబర్12 (మనం న్యూస్) మంథని మండలం రచ్చపల్లి గ్రామ శివారులో మంథని పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా,ఒక వ్యవసాయ భూమి నుండి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని జెసిబి సహాయంతో తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు మంథని పోలీసులు గుర్తించారని మంథని ఎస్సై ఎన్.సందీప్ కుమార్ తెలిపారు. ఒక జెసిబి సహాయంతో మట్టిని తవ్వి ఏడు ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలిస్తున్నట్లు తనిఖీలో తేలిందన్నారు.జెసిబి డ్రైవర్-కమ్-ఓనర్, ఏడు ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లు సహా మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.వారు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మట్టిని తవ్వి ట్రాక్టర్ ట్రిప్‌కి రూ.400 చొప్పున అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారనీ ఆయన పేర్కొన్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి జెసిబి, మట్టితో నిండిన ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులతో సహ మంథని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.ఫిర్యాదు ఆధారంగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

## చెట్ల కొమ్మలు కొడుతుండగా విద్యుత్ షాక్ తగిలి వృద్ధుడు మృతి

మంథని అక్టోబర్12 (మనంన్యూస్) : తేదీ 12-10-2026 రోజున ఉదయం సుమారు 08:30 గంటల సమయంలో మంథని మండలం రచ్చపల్లి గ్రామానికి చెందిన కాయతి లింగయ్య(85)అనే వృద్ధుడు చెట్ల కొమ్మలుకొడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతిచెందిన వ్యక్తి కుమారుడు కాయతి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంథని ఎస్సై ఎన్. సందీప్ కుమార్ కేసు నమోదు చేశారు.అదే రోజు ఉదయం సుమారు 08:00 గంటల సమయంలో రచ్చపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది వాంకుడోత్ శివయ్య మృతి చెందిన వ్యక్తిని రోడ్డు ప్రక్కన ఉన్న చెట్ల కొమ్మలు కొట్టమని ఆదేశించాడు.ఆ ప్రకారం మృతి చెందిన లింగయ్య చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా, అక్కడ ఉన్న లైన్ విద్యుత్ వైర్లకు తాకి కరెంట్ షాక్ వచ్చి కింద పడి మృతి చెందాడు.లింగయ్యను హుటాహుటిన మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,డ్యూటీ డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.చెట్టు దగ్గరగా లైవ్ విద్యుత్ వైర్లు ఉన్నప్పటికీ, ఎలాంటి హెచ్చరిక లేకుండా,ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా వృద్ధుడైన వ్యక్తిని చెట్టు ఎక్కి కొమ్మలు కొట్టమని నిర్లక్ష్యంగా ఆదేశించినందుకు వాంకుడోత్ శివయ్యపై కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.మృతుని కొడుకుఫిర్యాదు ఆధారంగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతోందని ఎస్సై సందీప్ కుమార్ పేర్కొన్నారు.

# 16న సి.ఈ.ఆర్. క్లబ్ లో బతుకమ్మ ఫ్యామిలీ డే వేడుకలు



యైటింక్లయిన్ కాలనీ,మనం న్యూస్ అక్టోబర్ 12 : సింగరేణి ఆర్.జి-2 ఏరియా పరిధిలోని కాలనీ సి.ఈ.ఆర్. క్లబ్ లో ఈ నెల 16వ తేదీ శుక్రవారం రోజున బతుకమ్మ ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్.జి-2 అధికార ప్రతినిధి నలివెలి వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక, ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ అని అన్నారు. ఆడబిడ్డలందరూ కలిసి ఆనందంగా జరుపుకునే ఈ వేడుకను కాలనీలోని మహిళలందరూ కలిసి జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ సంబరాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ ఆటలు, ఆటపాటల పోటీలు నిర్వహించి, అనంతరం పాల్గొన్న మహిళలకు ఆకర్షణీయ బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.కావున కాలనీలోని మహిళా సోదరీమణులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

# రామగిరి ప్రజావాణికి రెండు వినతి పత్రాలు



రామగిరి, అక్టోబర్ 12 (మనం న్యూస్): రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 15 మంది అధికారులు హాజరుకాగా, ప్రజల నుంచి రెండు వినతిపత్రాలు అందాయి.వాటిలో ఒకటి ఇంటి నంబర్‌కు సంబంధించిన సమస్యపై కాగా, మరొకటి జాబ్ కార్డుకు సంబంధించిన సమస్యపై వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారాణి, తహసీల్దార్ సుమన్, ఎంపీఓ సమ్మిరెడ్డి, ఏఈపీఆర్ వరలక్ష్మి, ఏఈఆర్‌డబ్ల్యూఎస్ మధు, ఇన్‌చార్జి ఎంఈఓ కొమురయ్య, ఏపీఎం పద్మ, ఇన్‌చార్జి ఏపీఓ మౌనిక, ఏఈ హౌసింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

వెల్గటూర్, అక్టోబర్ 12(మనం న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుందని మండల అభివృద్ధి అధికారి దొంద కృపాకర్ పేర్కొన్నారు. సోమవారం ఎండపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా 4 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దొంద కృపాకర్, గిర్దావర్ అన్వేష్, మండల వ్యవసాయ అధికారి కమల మహేష్, పశు వైద్య అధికారి మనోజ్ కుమార్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సర్ ప్రక్రియ పై గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందడమే కాంగ్రెస్ లక్ష్యం...



ఇల్లందకుంట, అక్టోబర్ 12 (మనం న్యూస్): కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ( ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తూ విషప్రచారం చేస్తున్నాయని, సర్ ప్రక్రియ పై గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యమని బిజెపి ఇల్లందకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బిజెపి మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధానంగా కాంగ్రెస్ , సిజెపి, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో నకిలీ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే 'ఎస్ ఐ ఆర్' ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సర్ పై అనవసర రాద్ధాంతం చేయడమే లక్ష్యంగా వ్యవహారాలు చేస్తున్న కాంగ్రెస్ , సిజెపి వైఖరి పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నకిలీ ఓట్లు , మరణించిన వారి ఓట్లు తొలగించవద్ద అని ఆయన ప్రశ్నించారు..? ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఇదేమి ప్రథమం కాదని , భారత ఎన్నికల సంఘం గతంలో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను నిర్వహించిందని గుర్తు చేశారు.

సుదీర్ఘ విరామం తర్వాత 2025 మరియు 2026 లలో దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ సర్ '' సర్వేను చేపట్టిందన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు ఓటర్లలో గందరగోళం సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు చేపట్టిన ఈ ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదన్నారు. బిజెపి ఓట్ చోరీ చేస్తుందని మాట్లాడుతున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఓట్ చోరీ తోనే గెలిచి 50 ఏళ్లు దేశాన్ని పాలించిందా..? అనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలని ఏకైక ఎజెండాతో కాంగ్రెస్ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తుందని ఆయన ఆరోపించారు. పూర్తి పారదర్శకతతో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై , చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలంతా గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, సిజేపీలు ఈ విషయంలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను, వైఖరిని విడనాడాలని హితువు పలికారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కంకణాల రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు, మండల ఉపాధ్యక్షులు తడిగొప్పుల రమేష్, చింతల ఐలయ్య, సీనియర్ నాయకులు ఇంగ్లే ప్రభాకర్ రావ్, రావుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



పెద్దపల్లి, అక్టోబర్,12: మనం న్యూస్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలనిలిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగుండం మండలానికి చెందిన ధర్ని.మల్లేష్ మండల శివారులోని సర్వే నెంబర్ 287 గల ఏడు గుంటల భూమి పట్టా పాస్ బుక్ లో తన పేరు చేర్చాలని దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ రామగుండం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మండలం నీరుకుల్లా గ్రామానికి చెందిన ముత్యం. మైసయ్య వృద్ధాప్యంలో తన కుమారులు తన బాగోగులు చూసుకోవడం లేదని దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ పెద్దపల్లికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన పోయిలా. కృష్ణ న్యాక్ లో ప్లంబర్ శిక్షణ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నానని, తనకు ఉద్యోగ అవకాశంకల్పించాలని దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన మహమ్మద్. జిలాని తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి

**తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.**

**జిల్లాల కలెక్టర్లు, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడిన డిప్యూటీ సీఎం.**

**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదిక నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

సిరిసిల్ల, అక్టోబర్ 12 (మనం ప్రతినిధి) : సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయని, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 2026--27 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

**తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పశుసంపదను కాపాడుకోవాలి**

పశుసంపదను కూడా రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. పశువులకు తగినంత తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. సూపర్ ఎల్‌నినో



ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచే రైతులకు అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముందస్తు అవగాహన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని, మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూరగాయల సాగు పెరిగిందని వివరించారు. యాసంగిలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రైతులు తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు, అందుబాటులో ఉన్న నీటి వివరాల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. యూరియా, విత్తనాల లభ్యతకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గి, కరువు పరిస్థితులు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రభావం మరింత బలపడవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఖరీఫ్ సాగు విస్తీర్ణం 15 శాతం తగ్గిందని వివరించారు. పత్తి, వరి పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, రైతు భరోసా కింద 75 లక్షల మంది రైతులకు రూ.8,500 కోట్ల నిధులు విడుదల చేశామని, లక్ష ఎకరాలకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశామని, ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనాలు అందించామని వివరించారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని, 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

**ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి**

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని సీఎస్ సూచించారు. గత ఏడాది రోజుకు సగటున 25 వేల మంది కూలీలు పనులకు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందని తెలిపారు. నెలాఖరుకు రోజువారీ కూలీల హాజరును 5 లక్షలకు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి సంరక్షణ పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, వ్యక్తిగత, సామూహిక సోక్ పిట్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని సూచించారు. పశువులకు మేత అందుబాటును పెంచే పనులను చేపట్టాలని తెలిపారు. మార్చి 2027 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనంగా రూ.6,500 కోట్ల మేర పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి**

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసాయని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు. వేడి వాతావరణంతో గృహ ఇతర అవసరాలకు విద్యుత్ వినియోగం సాధారణంకంటే దాదాపు 25 శాతం ఎక్కువ పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులలో ఆశించిన స్థాయిలో నీటి మట్టం లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ప్రాజెక్టులలో ఉన్న నీరు ప్రస్తుతం తాగు నీటికి, పశు సంపద సంరక్షణకు వినియోగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు నీటి వృథాను అరికట్టాలని పిలుపు నిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, ఆముదం, నువ్వులు, శెనిగెలు, పొద్దు తిరుగుడు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు కోరారు. ఉద్యానవన పంటల సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్ వాడాలని సూచించారు.

**మంచి దిగుబడి..**

ఆయిల్ పామ్, కూరగాయలు సాగు చేస్తున్న పలువురు రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. వీర్నపల్లి మండలానికి చెందిన రైతు రాములు నాయక్ మాట్లాడుతూ.. ఐదు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నానని, దిగుబడి మంచిగా వస్తుందని వివరించారు. నీటి వినియోగం, విద్యుత్ వాడకం చాలా తక్కువ ఉందని తెలిపారు. పర్యావరణ ఇబ్బందులు కూడా రావని పేర్కొన్నారు. బీరకాయ, సొరకాయ, టమాటాలు, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్నానని తంగళ్లపల్లి మండలం దేశాయ్ పల్లి రైతు రమేష్ తెలిపారు. వరికి బదులుగా కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం వస్తుందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీధర్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, నీటి పారుదల శాఖ, ఎన్పీడీసీఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మకు కల్వచర్లలో ముమ్మర ఏర్పాట్లు

రామగిరి, అక్టోబర్ 12 (మనం న్యూస్):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద--కుమారస్వామి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గ్రామంలోని ప్రతి మహిళ పండుగలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాల్గొనాలనే లక్ష్యంతో సోమవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పండుగ సమీపిస్తుండటంతో పెద్దమోరి మూలవాగు వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్‌ను సిద్ధం చేసే పనులకు ప్రాధాన్యమిస్తున్నారు.మహిళల సౌకర్యమే ప్రాధాన్యంబతుకమ్మ పండుగలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు సంతోషంగా పాల్గొనేలా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ చర్యలు చేపడుతోంది. ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సాయంత్రం వేళల్లో తగిన వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కనీస వసతులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు.కల్వచర్లలోని పెద్దమోరి మూలవాగు వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. పండుగ వేడుకలకు అనువైన వాతావరణం కల్పిస్తూ, సమయానికి అన్ని పనులు పూర్తయ్యేలా ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.సర్పంచ్ రేండ్ల శారదతో పాటు కుమారస్వామి ఏర్పాట్ల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండగా, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సహకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్ప మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్ రేండ్ల కుమారస్వామి, వార్డు సభ్యులు మల్యాల పద్మ, గోనె రాము, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

